కథ

# లాటరీ

డా॥ జి. ఎస్. పట్టాభిరామ్



గంగారాజు ఒక ప్రభుత్వ ఆఫీసులో నాలుగో తరగతి ఉద్యోగి. వేణీళ్ళకు చన్నీళ్ళు తోడన్నట్టుగా తన కొచ్చే జీతంతో బాటు తన భార్య అపుల నరసమ్మ పేరున ''నరసూ లాటరీ సెంటర్'' నడుపుతున్నాడు. తనకు ఖాళీ ఉన్నప్పుడు తనే కూర్చుంటాడు, తను ఆఫీస్‌కు వెళ్ళిన సమయంలో తన బామ్మరిది అప్పారావును అందులో కూర్చో బెడతాడు.

సొంబాబు ఒక చిరుద్యోగి. తన కొచ్చే జీతం కుటుంబ పోషణకు బావీ బాలతంగా ఉండటంతో, ఎలాగయినా లాటరీ లోనయినా లక్షలు గడించాలనే ఆశతో లాటరీ టిక్కట్లు ''నరసూ లాటరీ సెంటర్'' లో క్రమం తప్పకుండా కొంటుంటాడు.

అది మార్చి మొదటివారం. ఉగాదికి చిన్న దానికి ఒక గౌను కొనమంటూ భార్య ఇచ్చిన 100 రూపాయిలతో బజారుకి బయలు దేరాడు సొంబాబు. దారిలో ''నరసూ లాటరీ సెంటర్'' దగ్గిర తమిళనాడు బంపర్ కొటి రూపాయిలు అనే బోర్డు చూడగానే ఠక్కున ఆగిపోయాడు.

గంగరాజు ''నిజ్జంగానే వస్తాయండి. ఒక్క ఏభై రూపాయిలు మివి కావనుకోండి. పది రోజుల్లో మీరు కోటీశ్వరులై మారుతీ కారులో తిరుగుతారు'' అని ఆశ చూపించాడు.

దానితో సొంబాబు లో ఆశ పెరిగి తనదగ్గిరున్న వందతో రెండు టిక్కట్లు, మొత్తం అంకెలన్నీ కలిపితె రెండు వచ్చేటట్లు కొన్నాడు, రెండు సొంబాబు లక్కీ నంబరు. అందుకే రెండు టిక్కట్లు కొన్నాడు.

డ్రా తేది మార్చి 15 రానే వచ్చింది. ఆరోజు ఉదయమే సొంబాబు ఊళ్ళో ఉన్న గుడిలన్నీ ప్రదర్శన చేసి కనిపించిన దేవతలకూ, కనిపించిన దేవుళ్ళకూ తనకే కొటిరూపాయిలు ఇప్పించమని కోరుకున్నాడు. పనితా పని అన్నవరం సత్యనారాయణ స్వామికి వ్రతం చేసుకుంటానని, తిరుపతి వేంకటేశ్వరుడికి తల నీలాలు సమర్పించు కుంటానని మొక్కుకున్నాడు. సాయంకాలం భార్య శాంతకు, చిన్నారి గౌరిని తీసుకుని మళ్ళి ఒకసారి ఊళ్ళో ఉన్న నూకాలమ్మ తల్లికీ, వినాయకుడికీ, ఆఖరికి శబరిమల అయ్యప్ప స్వామికీ మొక్కుకున్నాడు.

పదహారవ తేది ఉదయం పేపర్లో లాటరీ రిజల్టు వచ్చిన పేపరు చూడగానే అప్పారావు కెవ్వుమని కేక పెట్టాడు.

గంగరాజు '' ఎందుకురా అంతగా అరిచావు, ఏమయింది నీకు '' అని విసుగ్గా అన్నాడు, అప్పారావు ''అది కాదు బావ! మనం అమ్మిన లాటరీ టికెట్టుకే కొటి రూపాయిల ప్రైజు వచ్చింది'' అని అన్నాడు.

గంగరాజు '' అలగా, ఏదీ నన్ను చుడనియ్'' అని పేపరు తీసుకుని తను కూడా కెవ్వుమని అరిచాడు. ఈ తతంగ మంతా చూస్తూన్న అప్పల నరసమ్మ బుర్రలో మెరుపు మెరిసింది అంతే వెంటనే గంగరాజుని పడగ్గదిలోకి లాక్కెళ్ళి చెవిలో గుసగుసలాడింది.

సొంబాబు పదహారవ తేదీ ఉదయం తొమ్మిది గంటకు ట్రిమ్‌గా తయారయి ఇంట్లో ఉన్న దేవుళ్ళ ఫోటోలన్నిటికీ దణ్ణం పెట్టుకుని నరసూ 'లాటరీ సెంటర్' కి వెళ్ళాడు. అప్పారావు '' తమిళనాడు రిజల్ట్సు ఇంకా రాలేదండి. రేపు వస్తాయి. రేపు రండి '' అని చెప్పాడు.

నిరాశతో సొంబాబు ఇంటికి వెళ్ళి, మళ్ళీ మర్నాడు తొమ్మిది గంటలకు లాటరీ సెంటర్‌కు వెళ్ళాడు.

అప్పరావు ''ఇదిగోండి పేపరు. ఇందులో మీ నంబరు ఉందేమో వెతుక్కోండి'' అని చిన్న పేపరు ఇచ్చాడు.

సొంబాబు ఆత్రుతగా ముందు ఫస్ట్ ప్రైజ్ నంబరు చూశాడు. ఊహూ రాదేదు. ఆతర్వాత వరుసగా అన్నీ ప్రైజ్‌లూ చూసుకుంటూ చివరిగా వంద రూపాయిల ప్రైజ్ దగ్గిన తన నంబరు కనబడగానే సంతోషపడి ''ఇదిగోనోయ్ అప్పారావూ. నాకు వంద రూపాయిల ప్రైజ్ వచ్చింది. ఈ టికెట్టు తీసుకుని వంద రూపాయిలివ్వు '' అని తన జేబులో నుండి టికెట్టు తీసి ఇచ్చాడు. అప్పారావు ఆటికెట్టు తీసుకుని కళ్ళ కద్దుకుని గళ్ళా పెట్టె లోంచి వంద రూపంయిల నోటు తీసి సొంబాబుకు ఇచ్చాడు.

తరువాత మంూణ్ణెళ్ళకే గంగరాజు ఉద్యోగానికి రాజీనామా చేసి నరసు ఫైనాన్సు కంపెనీ ప్రారంభించి మారుతీ కారులో తిరగటం ప్రారంభించాడు. అప్పారావు ఎప్పటిరనే ''నరసూ లాటరీ సెంటర్లో'' కూర్చుం టున్నాడు.

ఇంతకూ లాటరీ టికెట్లు అమ్మడమే కాని, ఎప్పుడూ కొనని గంగరాజుకి అంత డబ్బు అకస్మాత్తుగా ఎలా వచ్చింది? అని ఆశ్యర్య పోతున్నారు కదా, అక్కడే ఉంది కిటుకంతా. అప్పల నరసమ్మ చదువు కలేదు కాని బుర్ర పాదరసంలా పనిచేస్తుంది. తమ లాటరీ సెంటర్ అమ్మిన టికెట్టుకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది అని తెలియ గానే అర్జంటుగా ఒక ప్రెస్‌లో ఫస్ట్ ప్రైజ్ నంబరుకు వందరూపాయిలు వచ్చినట్టు ప్రింటు చేయించింది ఒక పేపరు. వంద రూపాయిలెందుకు దండుగ అని మీరు అనుకోచ్చు. కాని అక్కడే ఉంది మెలికంతా. ఏమీ రాక పోతే ఆ టికెట్టు ముక్కలు ముక్కలుగా చించి పారేస్తాడు. వంద రూపాయిల ప్రైజ్ వచ్చిందని తెలిస్తే అతి భద్రంగా ఆ టికెట్టు ఇస్తాడు.